సాక్షి ఖమ్మం

శనివారం । 16 । డిసెంబర్ । 2023



.. విజయానికి సోపానాలు

అపజయాలు ఎదురైతే కుంగిపోకుండా వాటినే విజయానికి సోపానాలుగా మార్చుకోవాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. 8లో



విశిష్టం.. ధనుర్మాసం

శనివారం నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుండగా ప్రత్యేక పూజల కోసం ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 19°

వాతావరణం

శనివారం ఉదయం, సాయంత్రం జిల్లాలో చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

హాజరు నమోదుకు బయోమెట్రిక్ యంత్రాలు



ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల ఏర్పాటు కావడంతో అందులో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల హాజరు నమోదు కోసం బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలందిస్తున్న వైద్యులు శుక్రవారం నుంచి బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు. మెడికల్ కళాశాల, ఆస్పత్రిలో కలిపి 131 మంది వైద్యుల కోసం పది బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేశారు. కాగా, ఇతర సిబ్బంది మాత్రం బయోమెట్రిక్ యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి



ఉద్యోగులను సన్మానిస్తున్న డీఎంహెచ్‌ఓ

నేలకొండపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింతగా పెరిగేలా వైద్యులు చొరవ తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి సూచించారు. నేలకొండపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నలుగురు గర్భిణులకు ప్రసవం చేయగా, పీహెచ్‌సీకి వచ్చిన డీఎంహెచ్‌ఓ సిబ్బందిని అభినందించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలు, అందుతున్న చికిత్సపై అవగాహన కల్పించడం ద్వారా ప్రసవాల సంఖ్య పెంచవచ్చని తెలిపారు. అనంతరం పైనంపల్లిలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని సందర్శించిన డాక్టర్ మాలతి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎంపీఓ సీ.హెచ్.శివ, ప్రభుత్వ వైద్యాధికారులు ఆర్.శ్రావణ్‌కుమార్, కె.రాజేష్, ఉద్యోగులు దుర్గ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు శ్రీమద్భగవద్గీత కంఠస్థం పోటీలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ కె.రామకృష్ణారెడ్డి తెలిపారు. భద్రాద్రి జిల్లా విద్యార్థులకు కొత్తగూడెంలోని శ్రీ శారద విద్యాలయంలో ఈనెల 19న, ఖమ్మం జిల్లా విద్యార్థులకు ఈనెల 23న ఖమ్మంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. శ్రీమద్భగవద్గీత మూడో అధ్యాయం కర్మయోగంలోని 1 నుంచి 30 శ్లోకాలు, సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై పోటీలు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం భద్రాద్రి జిల్లా విద్యార్థులు 93948 61212నంబర్‌కు, ఖమ్మం జిల్లా విద్యార్థులు 93916 40782 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

'తొలిమెట్టు'పై పట్టు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

చింతకాని: ఉపాధ్యాయులు తొలిమెట్టు కార్యక్రమంపై పట్టు సాధించడం ద్వారా విద్యార్థులకు మెరుగ్గా బోధించొచ్చని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. చింతకాని మండలం కొదుమూరు పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో డీఈఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ వహించాలని, హాజరుశాతం పెరిగేలా కృషి చేయాలని తెలిపారు. ఆతర్వాత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ పరిశీలించారు. సీఎంఓ రాజశేఖర్, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ పాపారావు, యూడైస్ ప్లస్ జిల్లా కోఆర్డినేటర్ భానుప్రసాద్‌తో పాటు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సారథులు..

త్వరలోనే పలు శాఖల అధికారులు బదిలీ

- ఆ స్థానంలో నూతన నియామకాలు
- రెండేళ్లు, ఆపైన సర్వీస్ పూర్తయిన వారిపై దృష్టి
- శాఖలు మారుతూ జిల్లా కేంద్రంలోనే పలువురి తిష్ట
- ఏళ్లుగా ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్న ఇంకొన్ని శాఖలు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాల్లో పలు శాఖలకు కొత్త సారథులను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. రెండేళ్లు, ఆపై సర్వీస్ పూర్తయిన వారి వివరాలను సచివాలయం కేంద్రంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు సేకరిస్తున్నారు. ఏళ్లుగా ఇన్‌చార్జిలతో కొనసాగుతున్న శాఖల వివరాలే కాక, జిల్లా కేంద్రంలోనే తిష్ట వేసి రెగ్యులర్, ఇన్‌చార్జిలుగా ఉన్న వారిపైనా ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులకు బదిలీలు ఇప్పటికే జరగగా.. మిగిలిన శాఖలు పూర్తయితే జిల్లా కేంద్రాల్లో అధికారుల బదిలీ చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. దీంతో రెండేళ్లు, మూడేళ్లు, ఆపై సర్వీస్ ఎవరెవరిది పూర్తయిందనే చర్చ ఉద్యోగ వర్గాల్లో మొదలైంది.

కీలక శాఖల్లో ..

కలెక్టరేట్‌లో పలు కీలక శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారుల బదిలీ జరిగే అవకాశం ఉంది. ప్రధానంగా రెవెన్యూ, సంక్షేమ, వ్యవసాయ, విద్యా, పౌర సరఫరాలు, ట్రెజరీ, ఇతర శాఖల్లోని ఉన్నతాధికారులతో పాటు కింది స్థాయి అధికారులు కూడా ఏళ్లుగా జిల్లా కేంద్రంలోనే పని చేస్తున్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలును తొలి ప్రాధాన్యతగా తీసుకోవడంతో ఆయా శాఖల్లో కొత్త అధికారులకు బాధ్యతలు అప్పగిస్తేనే పనులు వేగంగా పూర్తవుతాయనే భావనతో ఉన్నట్లు సమాచారం. దీంతో కలెక్టరేట్‌లోని శాఖల ఉన్నతాధికారుల వివరాలను తెప్పించుకుంటున్నట్లు తెలిసింది.

మూడేళ్లు దాటాయి..

జిల్లా కేంద్రంలోని పలు శాఖల ఉన్నతాధికారులు విధుల్లో చేరి మూడేళ్లు దాటింది. జిల్లా రవాణా శాఖ అధికారి, డీఎంహెచ్‌ఓ, ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, జిల్లా వెనబడిన తరగతుల ఉప సంచాలకులు, జిల్లా పరిశ్రమల శాఖ, మైనింగ్ జిల్లా అధికారులు మూడేళ్లుగా ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే, సీపీఓ, జిల్లా రిజిస్ట్రార్, డీఆర్‌డీఓ, జిల్లా పశుసంవర్ధక శాఖ, మార్క్‌ఫెడ్, దేవాదాయ శాఖ జిల్లా అధికారులు బాధ్యతలు చేపట్టి ఐదారు నెలల్లో మూడేళ్లు పూర్తికానుంది. ముందు మూడేళ్లు, ఆపైన.. ఆ తర్వాత త్వరలో మూడేళ్ల సర్వీస్ పూర్తి కానున్న అధికారుల బదిలీలు చేపట్టనున్నట్లు తెలిసింది.

ఇన్‌చార్జిలతోనే సరి

పలు కీలక శాఖలకు ఇన్‌చార్జ్ అధికారులతోనే నెట్టుకొస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారిగా డైట్ లెక్చరర్ సోమశేఖరశర్మకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి పోస్టు సుమారు ఆరేళ్లుగా ఇన్‌చార్జి అధికారులతోనే కొనసాగుతోంది. డీఎంగా ఉన్న జి.శ్రీలత డీఎస్‌ఓగా అదనపు బాధ్యతల్లో ఉన్నారు. పట్టు పరిశ్రమ విభాగం జాయింట్ డైరెక్టర్(వరంగల్) జి.అనసూయకు జిల్లా ఉద్యాన శాఖ ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యాన పంటలకు ప్రసిద్ధి అయినా ఐదేళ్లుగా రెగ్యులర్ అధికారి లేరు. ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా నవీన్ బాబు ఉన్నారు. హైదరాబాద్‌లోని మత్స్య శాఖ ప్రధాన కార్యాలయం అధికారి డి.ఆంజనేయ స్వామికి జిల్లా ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు అప్పగించారు. అలాగే, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పోస్టుల్లోనూ ఇన్‌చార్జ్‌లే ఉన్నారు. పలు శాఖలకు నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అధికారులకు ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడం గమనార్హం.

కదలక.. మెదలక...

కొన్ని శాఖల్లోని జిల్లా ఉన్నతాధికారులే కాక ద్వితీయ శ్రేణి అధికారులు సైతం ఏళ్లుగా జిల్లా కేంద్రాన్ని అంటిపెట్టుకొని ఇక్కడే తిష్టవేశారు. కొందరు మాతృశాఖను వదిలి ఇతర శాఖల ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకొని కొనసాగుతుండడం గమనార్హం. మాతృ శాఖలో మూడేళ్లు పూర్తయి బదిలీ సమయం రాగానే పలుకుబడితో ఇతర శాఖలకు ఇన్‌చార్జిలుగా వస్తున్నారు. అగ్నిమాపక శాఖలో జిల్లా కేంద్రంగా ఉన్న ఇద్దరు అధికారుల్లో ఒకరిది ఎనిమిదేళ్లు, మరొకరిది సుమారు పదేళ్ల సర్వీస్ పూర్తికావొస్తున్నా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సీ సంక్షేమ శాఖలో ఓ అధికారి జిల్లా కేంద్రంలో ఉద్యోగిగా మొదలై ఆరేళ్లలో ఉన్నతాధికారి స్థాయికి చేరినా ఇక్కడే కొనసాగుతుండడం గమనార్హం. వీరే కాకుండా జిల్లాలో డివిజన్, మండల కార్యాలయాల్లో కూడా పలు శాఖల్లో ఐదేళ్లు, పదేళ్ల సర్వీస్ పూర్తయిన అధికారులు ఉన్న నేపథ్యాన... ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఎంత కాలం నుంచి ఉన్నారనే అంశంపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో వివరాలు సేకరిస్తోంది.

'గుర్తింపు' తప్పనిసరి

- ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణానికి జీరో టికెట్లు
- ఏదైనా ధ్రువపత్రం చూపిస్తేనే అనుమతి



మహిళకు జీరో టికెట్ అందిస్తున్న ఆర్‌ఎం వెంకన్న, (ఇన్‌సెట్) జీరో టికెట్

ఖమ్మంమామిళ్లగూడెం: రాష్ట్రప్రభుత్వం ఎన్నికల హామీల అమల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. గత శనివారం ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించగా ఇప్పటివరకు మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు టికెట్లు కేటాయించకుండానే ప్రయాణానికి అనుమతిస్తున్నారు. ప్రస్తుతం కండక్టర్ల వద్ద ఉన్న టిమ్స్‌లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడం.. ప్రభుత్వం సబ్సిడీ నిధులు విడుదల చేసేలా రోజువారీ ప్రయాణికుల సంఖ్య తేల్చేందుకు గాను శుక్రవారం నుంచి జీరో టికెట్లు జారీ చేస్తున్నారు. తెలంగాణ వాసులకే మాత్రమే ఈ పథకం అమల్లో ఉండగా, ఇక నుంచి మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు తెలంగాణ వాసులుగా గుర్తించేలా ఏదైనా ధ్రువీకరణ పత్రాన్ని కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది.

మంచి స్పందన...

మహాలక్ష్మి ద్వారా మహిళలకు ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణానికి అవకాశం కల్పించగా రీజియన్‌లో మంచి స్పందన వస్తోంది. ఖమ్మం రీజియలోని ఏడు డిపోల పరిధిలో రోజూ వేలాది మంది ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. కాగా, శుక్రవారం ఖమ్మం పాత బస్టాండ్‌లో ఓ మహిళకు జీరో టికెట్‌ను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న అందజేసి మాట్లాడారు. మహిళలు ఇబ్బంది పడకుండా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ప్రయాణ సమయంలో ఆధార్ కార్డు లేదా ఏదైనా ధృవీకరణ పత్రాన్ని చూపిస్తే జీరో టికెట్ జారీ చేస్తారని పేర్కొన్నారు. అయితే, అందరికీ విషయం తెలిసే వరకు ఫోన్‌లోనైనా జిరాక్స్ కాపీ చూపించినా అనుమతించనున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం జీఎస్.పవిత్ర, ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాస్, అధికారులు రామిశెట్టి రామయ్య, శ్రీనివాస్, కె.అంజయ్య, జయరాజు, బీఆర్.రెడ్డి, సీతారామారావు, కృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎం కార్యాలయాన్ని సిద్ధం చేయండి



కార్యాలయ పనులను పరిశీలిస్తున్న ఆర్‌ఎం వెంకన్న

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న ఆదేశించారు. ప్రస్తుతం ఆర్‌ఎం కార్యాలయం జూబ్లీక్లబ్ ప్రక్కన అద్దె భవనంలో కొనసాగుతుండగా, పాత బస్టాండ్‌లో ఏర్పాటుకు నిర్ణయించారు. ఈనేపథ్యాన కార్యాలయ పనులను ఆర్‌ఎం శుక్రవారం పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. తొలుత పాత బస్టాండ్‌లో ప్రహరీ నిర్మాణ పనులు, కాంప్లెక్స్‌లో షాపుల నిర్వహణపై వివరాలు ఆరా తీశారు. ఆర్‌ఎం వెంట డిప్యూటీ ఆర్‌ఎం జీఎస్.పవిత్ర, అధికారులు కె.అంజయ్య, బి.శ్రీనివాస్, రామయ్య, శ్రీనివాస్, జయరాజు, బీఆర్.రెడ్డి, సీతారామారావు, కృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలి ఫిర్యాదుపై విచారణ



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన ఓ అధ్యాపకురాలు తనను అధ్యాపకుడు వేధిస్తున్నాడని ఫిర్యాదు చేయగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు శుక్రవారం విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమై వివరాలు ఆరా తీశారు. అలాగే, ఫిర్యాదుపై పోలీసులు కూడా విచారణ చేపట్టారు. కాగా, పలువురు మహిళా అధ్యాపకులు మాట్లాడుతూ గతంలో 40ఏళ్లు దాటిన అధ్యాపకులే బాలికల కళాశాలలో విధులు నిర్వర్తించేవారని, కానీ ఇప్పుడు అలా జరగకపోవడంతో సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఇక సదరు అధ్యాపకుడి సతీమణి మాట్లాడుతూ కావాలనే తన భర్తపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఈమేరకు ఆయనపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, డీవైఎఫ్ఐ, పీఓడబ్ల్యూ నాయకులు డీఐఈఓకు వినతిపత్రం అందజేశారు.

ఉత్సాహంగా 'బడాఖానా'



మాట్లాడుతున్న సీపీ వారియర్, పక్కన ఆయన సతీమణి, అధికారులు

నిత్యం విధినిర్వహణలో నిమగ్నమయ్యే పోలీసుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఆధ్వర్యాన శుక్రవారం బడాఖానా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ తన సతీమణి హృదయ మీనన్‌తో హాజరుకాగా, ఉద్యోగులు కూడా కుటుంబాలతో పాటు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పక్కా ప్రణాళిక, సమష్టి కృషితో అసెంబ్లీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈమేరకు ఉద్యోగుల ఉల్లాసం కోసం విందు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అనంతరం పలువురు ఉద్యోగులతో మాట్లాడిన ఆయన విధినిర్వహణలో ఒత్తిళ్లు, ఇతర సమస్యలు తెలుసుకున్నారు. అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీలు హరికృష్ణ, ప్రసన్నకుమార్, రవికుమార్, రామానుజం, రెహమాన్, శంకర్, నర్సయ్య, సుశీల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. – ఖమ్మంక్రైం

ఖమ్మం సమగ్రాభివృద్ధే లక్ష్యం

- నా విజయంలో కార్పొరేటర్ల కృషి మరువలేనిది
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించాక ఖమ్మం నుంచి వెళ్లిన కార్పొరేటర్లు, నాయకులతో సమావేశమయ్యారు. ఖమ్మం ఎమ్మెల్యేగా తాను భారీ మెజార్టీతో గెలుపొందడంలో కార్పొరేటర్లు చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. కబ్జాలు జరగకుండా కట్టడి చేయడంతో పాటు నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. ఖమ్మం కార్పొరేషన్‌లో కాంగ్రెస్ కార్పొరేటర్లకు అభివృద్ధి పనుల విషయమై నిధుల కేటాయింపులో ఇన్నాళ్లు వివక్ష ఎదురైందని, ఇలాంటివి ఇకనుంచి జరగకుండా సరిదిద్దుతానని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, చోటేబాబా, తుపాకుల యలగొండస్వామి, విజయ్‌కుమార్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, రావూరి సైదుబాబు, లకావత్ సైదులు, చావా నారాయణరావు, మలీదు జగన్, ఎస్.కే.ముక్తార్, నాగుల్‌మీరా, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మందడపు మనోహర్, పాకాలపాటి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఫైళ్లు పెండింగ్‌లో ఉండొద్దు

- సత్వరమే పరిష్కరించండి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లోని ఏ విభాగంలో కూడా ఫైళ్లు పెండింగ్ ఉండకుండా త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ విభాగాల ఉద్యోగులతో శుక్రవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ అత్యవసర ఫైళ్లపై అలసత్వం వహించొద్దని, ఆర్డీఓ, తహసీల్దార్, సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ప్రభుత్వ అవసరాలకు స్థల కేటాయింపునకు సంబంధించి ఫైళ్లపై పరిశీలించాలని తెలిపారు. అలాగే, ధరణి, గ్రీవెన్స్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కలెక్టరేట్ ఏఓ అరుణ, సూపరింటెండెంట్లు మీనన్, మదన్‌గోపాల్, సత్యనారాయణ, రంజిత్, ఈడీఎం దుర్గాప్రసాద్, ధరణి కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి ప్రమాణాలు పెంచాలి

ప్రతీ విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు సాధించేలా కార్యాచరణ అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ సూచించారు. తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలుపై శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆమె వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కరుణ మాట్లాడుతూ ప్రాథమిక దశలో 75శాతం మంది విద్యార్థులకు పూర్తి స్థాయి విద్యా ప్రమాణాలు ఉండటం లేదని తేలినందున తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. అనంతరం ఆయా కార్యక్రమాల అమలుపై ఆమె సూచనలు చేశారు. జిల్లానుంచి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పాఠశాల భవనాలకు రంగులు వేయించడంతో పాటు వసతులు కల్పించాలమని తెలిపారు. అలాగే, జిల్లాలో విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. వీసీలో డీఈఓ సోమశేఖరశర్మ, ఆర్‌ఎంఓ రాజశేఖర్, ఏఎంఓ రవి తదితరులు పాల్గొన్నారు.

పరుగుపందెంలో పాల్గొన్న దివ్యాంగులు



మేమెందులోనూ తగ్గేదే.. లే!

క్రీడాపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న దివ్యాంగులు



దివ్యాంగులతో కలిసి చెస్ ఆడుతున్న డీడబ్ల్యూఓ సుమ

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా, శిశు దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో దివ్యాంగులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా అథ్లెటిక్స్, క్రికెట్, చెస్, క్యారమ్స్‌లో దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి సుమ ప్రారంభించి మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారికి కాస్త చేయూతనిస్తే సత్తా చాటుతారని తెలిపారు. కాగా, హాజరైన వారికి సత్యమార్గం యూత్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు శ్రీలక్ష్మితో పాటు నగేష్, అనిత, మంజుల, సుబ్బలక్ష్మి, నరేష్, వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందడి

- మూడో రోజు వరాహావతారంలో రామయ్య దర్శనం
- శ్రీ సీతారామ చంద్రస్వామికి భక్తుల నీరాజనాలు



వరాహావతారంలో స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు, పక్కన ఈఓ రమాదేవి



మిథిలా స్టేడియం వేదిక వద్దకు ఊరేగింపుగా తరలివస్తున్న స్వామివారు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శ్రీ వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో శుక్రవారం మూడో రోజు స్వామివారు వరాహావతారంలో దర్శనమిచ్చారు. లోకకంటకుడైన హిరణ్యాక్షుడిని సంహరించి భూమిని తన కోరలతో పైకెత్తి లోకసంరక్షణ చేపట్టిన వరాహావతారంలో దర్శనమిచ్చిన రామయ్య స్వామికి భక్తులు నీరాజనాలు పలికారు. తెల్లవారుజామున ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి ఆరాధన, ఆరగింపు ఇచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలోని బేడా మండపం వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం వేద పండితులు దివ్య ప్రబంధాలు పఠించారు. ఆ తర్వాత వరాహావతారంలో అలంకరించిన స్వామివారిని అంతరాలయం నుంచి బేడా మండపానికి తీసుకొచ్చి ఆళ్వార్లతో కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు అనంతరం పల్లకీపై ఊరేగింపుగా మంగళవాయిద్యాలు, బాజా భజంత్రీలు, భక్తుల కోలాహలం నడుమ మిథిలా స్టేడియంలోకి తీసుకొచ్చారు. వేదికపై కొలువుదీర్చి, అర్చకులు హారతి ఇవ్వగా, పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం భక్తుల కోలాటాలు, రామనామస్మరణ నడుమ తిరువీధి సేవ సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

'హెరిటేజ్'లో ఘనంగా యజ్ఞం



వెంచర్ నిర్వాహకులతో జీయర్ స్వాములు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని ది ఖమ్మం వెరిటెజ్ వెంచర్, జాబిల్లి హోమ్స్‌లో నూతన భవన నిర్మాణాల శంకుస్థాపన సందర్భంగా శుక్రవారం శ్రీలక్ష్మీ నరసింహ సుదర్శన యజ్ఞం నిర్వహించారు. త్రిదండి దేవనాథ రామనుజ జీయర్ స్వామి ఆధ్వర్యాన నిర్వహించిన యజ్ఞంలో 108 మంది దంపతులు పాల్గొన్నారని వెంచర్ నిర్వాహకులు తెలిపారు. కాగా, భవన నిర్మాణాల శంకుస్థాపన సందర్భంగా సినీ హీరోయిన్ మెహరీన్ కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డెవలపర్స్ సీఎండీ డాక్టర్ కుంచపు రాంబాబుతో పాటు ఎస్.కే.జానీమియా, యరకల సైదులు, తమ్మిశెట్టి పరుశురాం, జానీమియా పాల్గొన్నారు.

భక్తి మార్గాన్ని అనుసరించాలి

ఖమ్మంగాంధీచౌక్: ప్రతిఒక్కరు భక్తి మార్గంలో నడవడం ద్వారా సమసమాజం ఏర్పడుతుందని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి తెలిపారు. ఖమ్మం జెడ్పీసెంటర్‌లోని వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు పోలా శ్రీనివాస్ నివాసంలో శుక్రవారం ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేంపటి లక్ష్మీనారాయణ, పారేపల్లి లక్ష్మీనారాయణ, మధుసూదన్‌రావు, పోట్ల మాధవరావు, పావని, సుజాత, నాగమణి, తాయారమ్మ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

తల్లాడ: తల్లాడలోని ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. తల్లాడకు చెందిన రంగా రమేష్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడగా విద్యుత్ మీటర్ వద్ద మంటలు వచ్చాయి. దీంతో మీటర్ కాలిపోయి దాని కిందే నిలిపిన మోటార్ సైకిల్‌పై నిప్పురవ్వలు పడడంతో కొంత మేర కాలిపోయింది. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది చేరుకుని విచారణ చేపట్టారు.

అపజయాలే విజయానికి సోపానాలు

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- ఘనంగా ప్రారంభమైన 'సెయింట్ ఆన్స్' క్రీడాపోటీలు
- 27 పాఠశాలలకు చెందిన 1,800 మంది క్రీడాకారుల హాజరు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి, పాఠశాల బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: ఏ రంగంలోనైనా అపజయాలు సహజమేనని.. వీటితో కుంగిపోకుండా సోపానాలుగా మార్చుకుని విజయానికి కృషి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో శుక్రవారం 18వ సెయింట్ ఆన్స్ రీజినల్ క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు క్రీడా పోటీల్లో గెలవాలనే ఆశయంతోనే ఉంటారని.. కానీ కొందరికే విజయం దక్కుతుందని తెలిపారు. ఈనేపథ్యాన ఓడిపోయినవారు కుంగిపోకుండా ప్రయత్నిస్తే ఫలితం ఉంటుందని చెప్పారు. కాగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెయింట్ ఆన్స్ పోటీలకు ఖమ్మం వేదికగా నిలవడం మంచి పరిణామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ కె.మరియసుందరి, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడగా డాక్టర్ శౌరీల్లు, సిస్టర్ ఎస్.నక్షత్రం, ఫాదర్ లాజర్, జి.భారతిరాణి, జువితా, సర్పనేని ఉషారాణి, కె.నర్సింహమూర్తి, రమణ, శశికళ, ఫణి తదితరులు పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు

సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో సెయింట్ ఆన్స్ క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని 27 పాఠశాలల నుంచి 1,800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు జరగనుండా డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహించేలా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటుచేశారు. ఈమేరకు ఖో-ఖో, కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు మూడురోజుల పాటు జరుగుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.నక్షత్రం తెలిపారు.



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న ఖమ్మం సెయింట్ జోసెఫ్ క్రీడాకారులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

హోరాహోరీగా క్రీడాపోటీలు



విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

- రెండో రోజుకు చేరిన ఆశ్రమ గిరిజన పాఠశాలల పోటీలు
- వివిధ క్రీడల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు

పాల్వంచ: మండలంలోని కిన్నెరసానిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధి గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడాపోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన ఏడు జోన్ల నుండి 674 మంది బాలురు, 621 మంది బాలికలు ఎనిమిది క్రీడాంశాల్లో పోటీ పడుతున్నారు. ఈమేరకు డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బి.గోపాలరావు, జోనల్ స్పోర్ట్స్ అధికారులు కె.వెంకటనారాయణ, ఎస్.నాగేశ్వరరావు, బి.రాంబాబు, బి.నెహ్రూ పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో పీడీలు వీరానాయక్, బి.వెంకటేశ్వర్లు, హరికృష్ణ, కె.వెంకటేశ్వర్లు, నాగులు, తారాచంద్, కృష్ణ, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వివిధ పోటీల్లో విజేతలు వీరే

- బాలుర కబడ్డీ సీనియర్స్ విభాగంలో పాల్వంచ, దమ్మపేట, జూనియర్స్ విభాగంలో వైరా, పాల్వంచ డివిజన్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.
- వాలీబాల్ సీనియర్స్‌లో దమ్మపేట, మణుగూరు, జూనియర్స్‌లో ఇల్లెందు, దమ్మపేట డివిజన్లు మొదటి, రెండో స్థానాల్లో నిలిచాయి.
- ఖో-ఖో సీనియర్స్‌లో వైరా, దమ్మపేట, సీనియర్స్‌లో దమ్మపేట, ఇల్లెందు డివిజన్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నాయి.
- ఆర్చరీ సీనియర్స్‌లో ఎం.చరణ్, జి.హర్షకమల్, జూనియర్స్‌లో పి.స్వాతి, డి.సాత్విక్ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.
- క్యారమ్స్ సీనియర్స్‌లో వైరా, దమ్మపేట, జూనియర్స్ విభాగంలో ఖమ్మం, దమ్మపేట డివిజన్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.
- చెస్ సీనియర్స్‌లో వైరా, దమ్మపేట, జూనియర్స్‌లో దమ్మపేట, ఇల్లెందు డివిజన్ల క్రీడాకారులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.
- టెన్నికాయిట్ సీనియర్స్‌లో దమ్మపేట, మణుగూరు, జూనియర్స్‌లో దమ్మపేట, మణుగూరు డివిజన్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో దక్కించుకున్నాయి.
- బాలికల అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెం సీనియర్స్‌లో కె.హారిక, ఇ.చందన, జూనియర్స్‌లో బి.దుర్గ, కె.కావ్య మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.
- షాట్‌పుట్ సీనియర్స్‌లో పి.దివ్య, పి.దివ్య, జూనియర్స్‌లో జి.అక్షయ, డి.అమృత మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నారు.
- లాంగ్‌జంప్ సీనియర్స్‌లో పి.సంధ్యారాణి, ఎం.కావ్య, జూనియర్స్‌లో వై.శృతిహాసిని, టి.మేఘన ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.
- బాలికల చెస్ సీనియర్స్‌లో బి.భానుభారతి, సార్థవి, జూనియర్స్‌లో వై.వైష్ణవి, ఎం.తులసి మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నారు.

విశిష్టం.. ధనుర్మాసం

- నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు
- రేపటి నుంచి వైష్ణవాలయాల్లో ప్రత్యేకపూజలు
- 23న ముక్కోటి ఉత్సవాలు ప్రత్యేకం



ఖమ్మం కమాన్ బజార్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం

ఖమ్మంగాంధీచౌక్: హిందూ ఆచారాలు, మాసాల్లో ధనుర్మాసానికి విశిష్ట స్థానం ఉంది. ఈ నెలలో నిర్వహించే తిరుప్పావై వ్రతానికి ప్రాధాన్యత ఇస్తారు. తిరుప్పావై అనేది ఒక గ్రంథం. కలియుగంలో మానవ కన్యగా జన్మించిన గోదాదేవి భగవంతుడిని భర్తగా భావించి ఆయనను చేపట్టడానికి సంకల్పించిన వ్రతమే తిరుప్పావై వ్రతం. ధనుర్మాసంలో ఈ వ్రతం నిర్వహిస్తుండడంతో ధనుర్మాస వ్రతంగా పేరొచ్చిందని చెబుతారు. సంక్రాంతి పండుగకు ముందు 30 రోజుల కాలాన్ని ధనుర్మాసంగా వ్యవహరిస్తుండగా, ఈ నెలంతా ఆలయాల్లో భగవంతుడిని కొలవడంతో పాటు ఇళ్లలో సంక్రాంతి సంబురాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రధానంగా ఈ నెలలో శ్రీ మహా విష్ణువును ప్రత్యేకంగా కొలుస్తారు.

ధనుర్మాసం...

కాలాన్ని కొలిచేందుకు అనేక కొలమానాలు ఉండగా.. ఇందులో చాంద్రమాన, సౌరమానాలు ప్రధానమైనవి. సౌరమానం ప్రకారం సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశించిన రోజు నుండి మకర రాశిలోకి ప్రవేశించే వరకు మధ్య కాలాన్ని ధనుర్మాసంగా వ్యవహరిస్తారు. సంక్రాతికి ముందు 30 రోజులు ఈ కాలం ఉంటుంది. పురాణాల్లో చెప్పినట్లుగా ఈ నెల రాత్రి వేళ ఎక్కువగా, పగటి సమయం తక్కువగా నమోదవుతుంది. ఈసారి 16వ తేదీ శనివారం అర్ధరాత్రి నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాసం ఉంటోంది. ఈమేరకు ఆదివారం ఉదయం నుంచి ఆలయాల్లో పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల పాటు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించటం ఆనవాయితీ కాగా... ఖమ్మం కమాన్‌బజార్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, త్రీటౌన్‌లోని శ్రీ లక్ష్మీరంగనాథ స్వామి ఆలయం, శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంతో పాటు ఇతర ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ముక్కోటి ఏకాదశి

ధనుర్మాసంలోనే ముక్కోటి ఏకాదశి వస్తుంది. ముక్కోటి ఏకాదశిని వైకుంఠ ఏకాదశిగా కూడా పిలుచుకుంటారు. ఈనెల 23న ముక్కోటి ఉత్సవాలు నిర్వహించనుండగా, ఆలయాల్లో స్వామి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిస్తాడు. ఒక్కో ఆలయంలో ఒక్కో రకంగా జనవరి 14 నుంచి 16 వరకు శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.

మహా విష్ణువుకు ప్రీతిపాత్రం

ధనుర్మాసం శ్రీ మహా విష్ణువుకు ఎంతో ప్రీతికరమైంది. అందుకే వైష్ణవాలయాల్లో ఈ నెలంతా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ మాసంలో లక్ష్మీనారాయణుడిని తులసీదళంతో పూజించడమే కాక గురువారాల్లో మహాలక్ష్మిని పూజిస్తారు.

సంక్రాంతి సంబురాలు

ఈ నెల పాటు మహిళలు తమ ఇళ్ల ముందు అందమైన ముగ్గులు వేసి ఆవుపేడతో గొబ్బెమ్మలు పెట్టి అలంకరిస్తారు. లక్ష్మీదేవి రూపంగా భావిస్తూ పూలు, పసుపుకుంకుమలతో పూజిస్తారు. చివరి రోజున రథం ముగ్గువేసి అమ్మవారిని ఊరేగిస్తున్నట్లుగా భావిస్తారు.


కేఎండీసీ అధ్యాపకుడికి డాక్టరేట్



మారంరాజు రంగారావు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ(కేఎండీసీ) కళాశాల ఫిజిక్స్ అధ్యాపకుడు మారంరాజు రంగారావుకు డాక్టరేట్ లభించింది. కేయూ ప్రొఫెసర్ గోపాలకృష్ణ, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ చంద్రలింగం ఆధ్వర్యాన ఆయన సమర్పించిన పరిశోధనా గ్రంథానికి గాను హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా రంగారావును కేఎంసీడీ సెక్రటరీ, కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి, చైర్మన్ నిరంజన్‌రెడ్డి, ప్రిన్సిపల్ కే.వీ.రమణారావు అభినందించారు.

ఎన్పీడీసీఎల్ సీఎండీని కలిసిన '327' ప్రతినిధులు



ఎన్పీడీసీఎల్ సీఎండీతో యూనియన్ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీగా కె.వరుణ్‌రెడ్డి శుక్రవారం హనుమకొండలోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 327 యూనియన్ జిల్లా అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యాన పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, పాత పెన్షన్ విధానం అమలు, ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపు, అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించడంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లాల యుగంధర్, జీ.వీ.రామారావు, ఉయ్యాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

18న బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

బోనకల్: జిల్లా స్థాయి బాలబాలికల బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక పోటీలు ఈనెల 18న బోనకల్ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. ఈపోటీల్లో ప్రతిభ కనబర్చే వారితో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర పోటీలకు గాను సీనియర్, జూనియర్స్ బాలబాలికల జట్లు ఎంపికచేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వయస్సు ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.సురేష్, బి.శ్రీనివాస్, కోచ్ అమిరేసి లింగయ్య సూచించారు.

సీనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ జట్టు..

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో ఈనెల 17న జిల్లాస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 8గంటలకు మొదలయ్యే పోటీలకు పురుషులు, మహిళలు ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు.

చెస్ ఎంపిక పోటీలు


జిల్లా పాఠశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన ఈనెల 17న చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కె.నర్సింహమూర్తి తెలిపారు. ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో అండర్ - 14, 17 విభాగాల్లో జరిగే పోటీలకు బాలబాలికలు వయసు ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా

కొత్తగూడెంటౌన్: గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి పదేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి(స్పెషల్ జడ్జి ఎన్‌డీపీఎస్ యాక్ట్) ఎం.శ్యాంశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. 2022 నవంబర్ 1న పాల్వంచలోని సోములగూడెం పరిధిలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు కారులో వెళ్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా ఉండడంతో పరిశీలించారు. వీరిద్దరు ఖమ్మం దివ్యాంగుల కాలనీకి చెందిన తెల్లబోయిన ఉమేష్, వైరా మండలం రెబ్బవరానికి షేక్ అస్లాంగా తేలగా కారులో రూ.33లక్షలకు పైగా విలువైన 168కేజీల గంజాయి లభించింది. ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని తీసుకొస్తున్నట్లు విచారణలో వెల్లడించడంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం ఉమేష్, అస్లాంపై నేరం రుజువుకాగా ఒక్కొక్కరికి పదేళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ విజయ్‌కుమార్ వాదించగా, సిగ్గా వెంకటేష్, ఎం.హరిగోపాల్ సహకరించారు.

ఈ దొంగ... భక్తాగ్రేసరుడు!

- చెప్పులు మెడలో వేసుకుని ఆలయంలో చోరీ



చెప్పులు మెడలో వేసుకుని తాళం పగులకొడుతున్న దొంగ

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ సందర్భంగా ఆలయం తాళాలు పగలగొట్టి చొరబడిన దొంగ హుండీని సైతం పగలగొట్టి అందులో ఉన్న నగదు చోరీ చేశాడు. అయితే, సదరు దొంగ ఆలయంలో చెప్పులతో వెళ్లడం తప్పు అనుకున్నాడో.. బయట వదిలేస్తే ఎవరైనా గుర్తు పడతారని అనుకున్నాడో ఏమో కానీ చెప్పులను తాడుకు కట్టి తన మెడలో వేసుకుని మరీ ఆలయంలోకి రావడం విశేషం. ఆయన లోపలకు రావడం తాళాలు పగలగొట్టిన దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. అయితే, సదరు వ్యక్తి గతంలోనూ ఇదే ఆలయంలో చోరీకి పాల్పడ్డాడని చెబుతున్నారు. ఈమేరకు ఆలయ పూజారి పంతంగి పవన్‌కుమార్‌శర్మ ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం ఉదయం నేలకొండపల్లి ఎస్సై బి.సతీష్ చేరుకుని క్లూస్‌టీమ్‌తో పాటు ఆధారాలు సేకరించారు.

LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

LIC HFL – LIC HOUSING FINANCE LTD – With you, for your dream home

201, 2వ అంతస్తు, క్రిష్ సఫైర్, సౌత్ బ్లాక్, సర్వే నం.88, మాదాపూర్, హైటెక్ సిటీ మెయిన్ రోడ్, హైదరాబాద్- 500081

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, (LIC HFL) అధీకృత అధికారియగు దిగువ సంతకందారు దిగువ తెలిపిన రుణగ్రహీతలు/ తనఖాపెట్టిన వ్యక్తులకు డిమాండ్ నోటీసు జారీ చేసి సదరు నోటీసులలో పేర్కొన్న చెల్లించవలసిన బకాయి మొత్తం తిరిగి చెల్లించాల్సిందిగా కోరారు. అయితే రుణగ్రహీతలు/ తనఖాపెట్టిన వ్యక్తులు సదరు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13 (4) క్రింద మరియు సెక్షన్ 14 క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు దిగువ తెలిపిన ఆస్తులను భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు.

క్ర. సం.	లోన్ నం./ రుణగ్రహీత/ సహ రుణగ్రహీత పేరు	ఆస్తి చిరునామా మరియు ప్లాట్ విస్తీర్ణం/ భూమి యొక్క UDS	రిజర్వు ధర	బయానా (రిజర్వు ధరలో 10%) తనిఖీ తేది & సమయం	బ్యాంక్ వివరాలు (దిగువ తెలిపిన ఖాతాకు బయానా బదిలీ చేయవలెను)
1.	లోన్ A/c Nos. 711600005702 & 711600006068 పేరు: మొవ్వ రవికుమార్	రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.3587/2017 తేది: 05-09-2017 ప్రకారం 183.33 చ.గజాల విస్తీర్ణం గల భూమి మరియు BUP ఏరియా 992 చ.అడుగుల విస్తీర్ణంతో ఖమ్మం జిల్లా అరెంపుల (గ్రామపంచాయతీ), బారుగూడెం (గ్రామం), SNo.64/A, 64/B, 70/B1, 70/B2, 70/B3, 70/C, 72/A, 72/B, 72/C ప్లాట్ నం.152 H.No.6-152/PII. సైట్ సరిహద్దులు: ఉత్తరం: 33 అడుగుల వెడల్పు రోడ్, దక్షిణం: ప్లాట్ నం.151, తూర్పు: 33 అడుగుల వెడల్పు రోడ్, పశ్చిమం: ప్లాట్ నం.153.	రూ. 28,35,000 /-	బయానా రూ. 2,83,500/- తనిఖీ తేదీలు: 23.12.2023 06.01.2024 13.01.2024	ఖాతా నంబర్: HFLESEHYWA05702 IFSC Code: UTIB0CCH274 ఆస్తి ఐడి: SEHYWA05702

ఇ-వేలం వెబ్‌సైట్	https://www.bankeauctions.com
టెండర్/ సీల్డ్ బిడ్ దాఖలుకు ఆఖరి తేది	20.01.2024న సా.5.00 గం.ల లోగా (ఆన్‌లైన్ విధానంలో మాత్రమే)
ఇ-వేలం తేది	20.01.2024న మ.12.00 గం.ల నుండి మ.1.00 గం.వరకు

పైన తెలిపిన సదరు ఆస్తులు/ ప్రాపర్టీస్ యొక్క ఇ-వేలం అమ్మకం కొరకు ఈ బహిరంగ ప్రకటనకు (SARFAESI, చట్టం 2002లోని నియమ నిబంధనలు మరియు దాని క్రింద నియమాలు) తదుపరి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే" "ఉన్నది ఉన్నట్లుగా" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "ఎట్టి సహాయం లేనట్టి" ప్రాతిపదికపైన సదరు ఆస్తుల కొనుగోలుకు సీల్డు కవర్/లు లేదా ఆన్‌లైన్ విధానంలో LIC HFL ఆఫర్లు కోరుతోంది.

వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనలు దిగువ తెలిపిన విధంగా ఉన్నాయి.

1. ఇ-వేలం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు అక్కడ ఏమి ఉన్నదో అదే" ప్రాతిపదికపైన మరియు ఎటువంటి సహాయం లేని ప్రాతిపదికపైన జరుగుతుంది మరియు "ఆన్‌లైన్"లో నిర్వహించబడుతుంది. ఇ-వేలం LIC – హౌసింగ్ ఫైనాన్స్ ఆమోదిత ఇ-ఆక్షన్ సర్వీస్ ప్రొవైడర్ "మెసర్స్ అర్క ఇమార్ట్ ప్రైవేట్ లిమిటెడ్" ద్వారా నిర్వహించబడుతుంది. కాగోరు బిడ్డర్లు పోర్టల్ https://auctionbazaar.comలో తమ పేర్లు తప్పక నమోదు చేసుకొని మరియు వారి యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందవలెను. కాగోరు బిడ్డర్లు ఇ-వేలంపై ఆన్‌లైన్ శిక్షణను సర్వీస్ ప్రొవైడర్ AUCTIONBAZAAR.COM నుండి ఇ-వేలంపై ఆన్‌లైన్ శిక్షణ పొందవలెను. హెల్ప్‌లైన్ నం. +91-9603716999, +91-8370969696, ఇ-మెయిల్ ఐడీలు: contact@auctionbazaar.com, support@auctionbazaar.com
2. ఇ-వేలం అమ్మకం SARFAESI చట్టం/రూల్స్ 2002లో నిర్దిష్టపరిచిన నిబంధనలు మరియు దిగువ/వెబ్‌సైట్‌లో తెలిపిన నియమ నిబంధనలకు లోబడి ఉంటుంది, కాగోరు/పాల్గొనే బిడ్డర్లచే దాఖలు చేయబడే ఆఫర్/బిడ్ డాక్యుమెంట్లలోని నిబంధనలకు లోబడి కూడా ఉంటుంది.
3. ప్రతి బిడ్డరు ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనే నిమిత్తం అతని / ఆమె సొంత ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండవలెను. ఒకసారి కాగోరు బిడ్డరు LICHFL యొక్క అధీకృత అధికారి సమక్షంలో అర్హత పొందిన టెండరుదారుగా అధికారికంగా నమోదైతే, డాక్యుమెంట్ దాఖలు చేయడం ద్వారా ఇ-వేలం బిడ్డింగ్ ప్లాట్‌ఫారం ద్వారా పాల్గొనుటకు అతను/ఆమె ఆసక్తిని తెలియజేయవలసి ఉంటుంది. ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ నుండి అతను/ఆమె లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్ సేకరించుకొనుట టెండరుదారు/ఆన్‌లైన్ బిడ్డరు యొక్క సంపూర్ణ బాధ్యత.
4. పైన తెలిపిన ఆస్తుల కోసం ప్రతి ఆస్తికి విడిగా పైన తెలిపిన రిజర్వు ధర కంటే తక్కువకు విక్రయించబడవు. సదరు డిపాజిట్/లు గెలుపొందిన బిడ్డరు/ల విషయంలో సర్దుబాటు చేయబడును. లేనట్లయితే వాపసు చేయబడును. సదరు బయానా డిపాజిట్/లుపై ఎటువంటి వడ్డీ రాదు. గెలుపొందిన బిడ్డరు చెల్లింపులు చేయడంలో విఫలమైతే లేదా ఏ విధంగా అయినా సీల్డ్ టెండరు/వేలం నియమ నిబంధనలను పాటించడంలో విఫలమైతే, ఇది వరకే డిపాజిట్ చేసిన మొత్తం స్వాధీనం చేసుకోబడుతుంది మరియు అతను/ఆమె అట్టి స్వాధీనం చేసుకోబడిన మొత్తంపై ఎటువంటి క్లెయిమ్‌ను కలిగి ఉండరు.
5. టెండర్లు తెరిచిన తరువాత రిజర్వు ధర కంటే తక్కువ కాకుండా తమ బిడ్లను దాఖలు చేసిన కాగోరు బిడ్డర్లకు అధీకృత అధికారి సంపూర్ణ విచక్షణ మేరకు బిడ్డింగ్ మొత్తాన్ని పెంచుకునేందుకు ఒక అవకాశం ఇస్తారు.
6. గెలుపొందిన బిడ్డరు/లు అమ్మకానికి సంబంధించి అధీకృత అధికారిచే ఆఫర్ అంగీకారం పొందిన మీదట వెంటనే ఇదివరకే చెల్లించిన బయానాను సర్దుబాటు చేస్తూ అమ్మకం ధరలో 25% మొత్తాన్ని డిపాజిట్ చేయవలెను. విఫలమైతే బయానా డిపాజిట్ స్వాధీనం చేసుకోబడుతుంది. అమ్మకం ధరలోమిగిలిన 75% మొత్తం అధీకృత అధికారి ఏకైక విచక్షణపై అమ్మకం నిర్ధారించిన తేది నుండి 15 రోజులలోగా చెల్లించవలెను. నిర్దేశిత కాలవ్యవధిలోగా మిగిలిన మొత్తం డిపాజిట్ చేయడంలో విఫలమైతే, డిపాజిట్ చేసిన మొత్తం స్వాధీనం చేసుకోబడుతుంది. అధీకృత అధికారి స్వాధీనం చేసుకునేందుకు గెలుపొందిన బిడ్డరుకు ఎటువంటి తదుపరి నోటీసు ఇవ్వవలసిన అవసరం లేదు.
7. ప్రతీ బిడ్ కోసం బిడ్డింగ్ ఇంక్రిమెంట్ కనీసం రూ.15000/- (పదిహేను వేల రూపాయలు మాత్రమే) లేదా రూ.15000/- (పదిహేను వేల రూపాయలు మాత్రమే) ఇంక్రిమెంట్ గుణకాలలో నిర్ణయించబడింది.
8. బిడ్డర్లు "కొనుగోలుదారులకు హెచ్చరిక" (కొనుగోలుదారు జాగ్రత్త) సూత్రానికి లోబడి ఉండవలెను మరియు సంస్థ లేదా సెక్యూర్డ్ ఆస్తి యొక్క ఏవేని తాకట్టు రుణభారాలు, చట్టబద్ధ బకాయిలు, ఆస్తిపన్ను ఎరియర్స్, ఆదాయపన్ను, ఎక్సైజ్ సుంకం, లేబర్ బకాయిలు, విద్యుత్ మరియు నిర్వహణ బకాయిలు మొ॥ వాటిని కనుగొనేందుకు తమ సొంత తగు జాగ్రత్త వహించవలసిందిగా సూచించబడుతున్నారు. గెలుపొందిన బిడ్డరు అన్ని ఔట్ గోయింగ్ అనగా మున్సిపల్ పన్నులు, నిర్వహణ/ సొసైటీ చార్జీలు, విద్యుత్ చార్జీలు, నీటి చార్జీలు, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు (వర్తిస్తే) లను, అమ్మకం ధర కాకుండా సంబంధిత ఆస్తులకు సంబంధించిన అన్ని అవుట్ గోయింగ్‌తో సహా ఏవేని మరియు అన్ని ఇతర అనుషంగిక చార్జీలు, వ్యయమును భరించవలెను.
9. గెలుపొందిన బిడ్డరు రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, పన్నుల వంటి అమ్మకం సర్టిఫికేట్‌పై చెల్లించదగు చార్జీలు/ఫీజులు లేదా అతను/ఆమె పేరున సెక్యూర్డ్ ఆస్తిని బదిలీ చేసేందుకు ఏవేని ఇతర డ్యూటీలను భరించవలెను.
10. ఏదేని స్థిరాస్తి యొక్క అమ్మకం ధర రూ.50.00 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, వేలం కొనుగోలుదారు స్థిరాస్తి అమ్మకం ధరలో 1% ఆస్తి యజమాని పేరున TDS తగ్గించుకుని ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 194 IA ప్రకారం ఆదాయపన్ను శాఖకు జమచేయవలెను మరియు స్థిరాస్తి [illegible]
11. [illegible]
12. [illegible]
13. [illegible] 9603716999, 8370969696 [illegible]
14. [illegible]
15. [illegible]

[illegible] https://lichousing.auctionbazaar.com [illegible]

తేదీ: 16.12.2023
ప్రదేశం: హైదరాబాద్

సం/- అధీకృత అధికారి
LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, హైదరాబాద్